

తల్లులకు గర్భశోకం

- యేడాదిలో 56 మంది శిశువులు మృతి
- 10 మంది బాలింతలు మృత్యువాత
- యేటా పెరుగుతున్న మాతా శిశు మరణాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



జిల్లాలో శిశు మరణాలు యేటా పెరుగుతున్నాయి. పౌష్టికాహార లోపం, రక్తహీనత, సకాలంలో వైద్యం అందకపోవడం తదితర కారణాలతో గర్భిణీలు మృత్యువాత పడుతున్నారు. ప్రసవ సమయంలో నిర్లక్ష్యం, శిశువుకు సరైన చికిత్స అందక నవజాత శిశువులు మరణిస్తున్నారు. శిశు మరణాలు అధికంగా జరగడంతో తల్లులకు గర్భశోకం మిగులుతోంది. యేడాది కాలంలో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 56 మంది శిశువులు, పది మంది బాలింతలు మరణించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని మరణాలు జరగకుండ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫలితం ఇవ్వని ప్రభుత్వ చర్యలు



బెల్లంపల్లి వంద పడకల ఆసుపత్రి

మాతా శిశు మరణాలు తగ్గించడానికి ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఉపయోగం ఉండడం లేదు. గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. గర్భం దాల్చిన సమయంలో మహిళలు రక్తహీనత, పౌష్టికాహార లోపంతో ఆసుపత్రులకు వెళితే వైద్యులు సరైన అవగాహన కల్పించడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందకపోవడంతో గర్భిణీలు, శిశువు మృతి చెందుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రాల్లో వంద పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేశారు. వైద్యులు, పరికరాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. డెలివరీ సమయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే మాతా శిశు మరణాలు సంభవిస్తున్నాయని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ఎదుట ధర్నాలు చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులు, వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి మాతా శిశు మరణాలకు అడ్డుకట్టపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బెల్లంపల్లి, జూలై 4: పౌష్టికాహార లోపం, రక్తహీనత, సకాలంలో వైద్యం అందకపోవడం తదితర కారణాలతో గర్భిణీలు, బాలింతలు మృత్యువాత పడుతున్నారు. పుట్టిన వెంటనే సరైన చికిత్స అందకపోవడం, ముందస్తుగా ప్రసవం వంటి కారణాలతో శిశువులు మృత్యువాత పడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత, సరైన పరికరాలు, సదుపాయాలు లేకపోవడంతో గర్భిణీలు, నవజాత శిశువులు మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొందరు వైద్యుల పనితీరులో నిర్లక్ష్యం వల్ల గర్భిణీలు, శిశువులు మరణిస్తున్నారు. ఆసుపత్రుల ఎదుట బాధిత కుటుంబాలు ఆందోళనలు చేస్తున్న ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

యేడాదిలో 10 మంది బాలింతలు, 56 మంది శిశువులు మృతి

జిల్లా వ్యాప్తంగా పలు ఆసుపత్రుల్లో గతేడాది మార్చి నుంచి ఈయేడు మార్చి వరకు యేడాదిలో 10 మంది బాలింతలు, 56 మంది శిశువులు మృతి చెందారు. ప్రభుత్వం మాతా శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ జిల్లాలో యేటా శిశు మరణాలు పెరుగుతూనే ఉన్నాయి.

- 2019-20లో 11 మంది బాలింతలు, 38 శిశు మరణాలు చోటు చేసుకున్నాయి.
- 2020-21లో 11 మంది తల్లులు, 27 శిశు మరణాలు.
- 2021-22లో 12 మంది తల్లులు, 22 శిశు మరణాలు
- 2022-23లో 8 మంది తల్లులు, 28 మంది శిశువులు మృత్యువాత పడ్డారు.
- 2023-24లో 10 మంది తల్లులు, 56 మంది శిశువులు మృతి చెందారు. గడిచిన 4 ఏండ్లలో జిల్లాలో మొత్తం 52 మంది బాలింతలు మృతి చెందగా, 152 మంది శిశువులు మృతిచెందారు.



విధులు చేయమని వెళ్లిపోతున్న వైద్యులు

బెల్లంపల్లిలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించమని 4 నెలల వ్యవధిలో నలుగురు వైద్యులు రాజీనామా చేశారు. జనరల్ సర్జన్ శ్రీకర్‌రావు, ఛాతి వైద్య నిపుణురాలు విజేత, వైద్యులు సాయితారుణ్య, మదన్ మోహన్‌లు రాజీనామా చేసినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మాతా శిశు మరణాలు చోటు చేసుకుంటున్న సమయంలో బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగడం, వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో రెగ్యులర్ వైద్యుడిని నియమించలేదు. ఇలా పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రధాన సమస్యలు పట్టి పీడిస్తున్నా జిల్లా వైద్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు తలెత్తుతున్నాయి.

మాతా శిశు మరణాల నియంత్రణకు చర్యలు

అనిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

జిల్లాలో మాతా శిశు మరణాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. గర్భిణీల్లో రక్తహీనత తగ్గించేందుకు ఐరన్ ట్యాబ్లెట్లు, మందులను అందజేస్తున్నాం. వైద్యం అందించడంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వైద్యులపై చర్యలు తీసుకుంటాం. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య కార్యకర్తల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రసవం సమయంలో ఎవరైనా వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమ దృష్టికి వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

బొగ్గు గనుల వేలంపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 4: బొగ్గుగనుల వేలం పాటలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. బొగ్గు గనుల వేలం ఆపకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. గంగాధర్ చారి, ప్రేంకుమార్, మోహన్, బిక్కయ్య, రాజేశం, శేఖర్ పాల్గొన్నారు.

లీజు గడువు పొడిగించాలని ఆందోళన


వాటర్ ట్యాంకుపై ఉన్న ముదిరాజ్‌లు

భీమారం, జూలై 4: గొల్ల వాగు ప్రాజెక్టు చేపల టెండరు విషయమై మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్‌లు సుంకరి దుర్గయ్య, నరసయ్య, మధుకర్‌లు గురువారం వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తాము రూ.40 లక్షలకు టెండరు దక్కించుకుని రూ.30 లక్షలు ముదిరాజ్ సొసైటీకి అందించి 10 లక్షల చేప పిల్లలను ప్రాజెక్టులో వేశామన్నారు. గడువు ముగిసే సరికి తమకు నష్టం వచ్చిందన్నారు. అప్పుడు పెద్ద మనుషుల సమక్షంలో పోలీసుల సహకారంతో 18 నెలల గడువు పొడిగించారని, ప్రస్తుతం ఇంకా నష్టం ఉందని, మరో 6 నెలలు ఇవ్వాలని పేర్కొన్నారు. సొసైటీ వారు గడువు పెంచకపోవడంతో వాటార్ ట్యాంకు ఎక్కామన్నారు. ఎస్ఐ రాములు సమస్యను పరిష్కరిస్తామని తెలపడంతో ట్యాంకు దిగి కిందకు వచ్చారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా




మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధితులు

నస్పూర్, జూలై 4: మున్సిపల్ అధికారులు అకారణంగా ఇంటిని కూల్చివేశారని గురువారం తీగల్‌పహాడ్‌కు చెందిన గొల్లె దశరథం కుటుంబ సభ్యులతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మున్సిపల్ అధికారుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కుటుంబ సభ్యులతో మున్సిపల్ కార్యాలయం వద్ద పురుగు మందు డబ్బాలను చూపిస్తూ ఆందోళన చేశారు. ఎస్సైలు రవి కుమార్, జితేందర్‌సింగ్‌లు ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినక పోవడంతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులు విలేకరులతో మాట్లాడుతూ ఠాగూర్‌నగర్‌లోని సర్వే నంబరు 45లో మున్సిపల్ అధికారుల అనుమతితోనే ఇంటి నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఇంటికి నంబరుతోపాటు కరంట్ మీటర్ ఉందన్నారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చివేశారన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన డీఈవో

ఏసీసీ, జూలై 4: పట్టణంలోని హమాలీవాడ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను డీఈవో యాదయ్య గురువారం పరిశీలించారు. బోరు చెడిపోయి తాగునీరు, మధ్యాహ్న భోజనం వండడానికి, టాయిలెట్లకు నీటి సరఫరా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో పాఠశాలలో కొత్తగా నీటి సంపు నిర్మాణం చేపట్టారు. డీఈవో సంపు నిర్మాణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. జాతీయ విద్యార్థి సమాఖ్య నాయకులు పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డీఈవోకు వినతిపత్రం అందించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ, స్కావెంజర్‌ను నియమించాలని, వంట చేయడానికి గ్యాస్ సిలిండర్ ఏర్పాటు చేయాలని కోరారు. చేరాల వంశీ, శివతేజ, పాఠశాల హెచ్ఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

మంచిర్యాల అర్బన్, జులై 4 : జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ గురువారం డివిజన్‌లోని ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో సమావేశమయ్యారు. ఆమె డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, వారు కొనుగోలు చేసిన దానికి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. విక్రయాలు జరిపే సమయంలో రైతుకు సంబంధించిన ఆధార్‌ను ఈపీవోఎస్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శ్రీరాంపూర్, జూలై 4 : వర్షాకాలం సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సింగరేణి ఏరియా వైద్యాధికారి లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. ఆర్‌కె న్యూటెక్ గనిపై వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. నివాస స్థలాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, డెంగీ, మలేరియా, తదితర వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏ వ్యాధి అయినా వచ్చిన తరువాత వైద్యం పొందేబదులు రాకుండా జాగ్రత్తగా ఉండడం మేలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ స్వామిరాజు, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టెండర్లు రద్దు

ఏసీసీ, జూలై 4: మంచిర్యాల పట్టణంలోని వివిధ వార్డుల్లో 45 అభివృద్ధి పనులకు జూన్ 28న కాంట్రాక్టర్లు దాఖలు చేసిన ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ మారుతిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల దాఖలుకు గడువు ముగియకముందే వాటిని రద్దుపర్చినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు సిండికేట్ అయినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో టెండర్లను రద్దు చేసినట్లు తెలిపారు.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం నామినేషన్‌లు పంపించాలి

ఏసీసీ, జూలై 4: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల నుంచి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ప్రతీ పాఠశాల నుంచి 5 నామినేషన్లు పంపించాలని డీఈవో యాదయ్య గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను నామినేషన్‌లను సెప్టెంబరు 15లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అన్ని మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు ఆయా పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించి నామినేషన్‌లు దాఖలయ్యేలా పర్యవేక్షించాలన్నారు. పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేయాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు 9849550200లో సంప్రదించాలని సూచించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

దండేపల్లి, జూలై 4: మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అలిశెట్టి సహస్ర అనే విద్యార్థిని బాసర ఐఐఐటీకి ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జన్నారం: కిష్టాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రాథోడ్ ఈశ్వర్, విజయ్‌కుమార్, సాయి వర్ధన్‌లు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

భీమారం: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి చదివిన హెప్సీబా బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్ఎం విక్రమ్‌కుమార్ తెలిపారు. గురువారం విద్యార్థినిని అభినందించారు.

గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, జూలై 4: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపక పోస్టు నియమానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ అభ్యర్థులు పీజీ సబ్జెక్టులో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, ఎస్ఈటీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఈనెల 6వ తేదీన దరఖాస్తులను అందించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

జన్నారం, జూలై 4: జన్నారం మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని గురువారం కలెక్టర్‌కు సామాజిక ఉద్యమకారుడు తాళ్లపల్లి రాజేశ్వర్ వినతిపత్రం అందించారు. జన్నారం రెవెన్యూ డివిజన్‌గా చేస్తే గ్రామాల ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

కాసిపేట, జూలై 4: ఐదేండ్లుగా మండలానికి సేవలందించిన ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, ఎంపీటీసీలు మేరుగు పద్మ, నవనందుల చంద్రమౌళి, కోఆప్షన్ సిరాజ్‌ఖాన్‌లను కాంగ్రెస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన

జైపూర్, జూలై 4: నూతన విద్యా విధానంపై గురువారం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య హాజరైన పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను వివరించారు. సీడీపీవో మనోరమ, సూపర్‌వైజర్‌లు కవిత, రజిత, సువర్ణ, రజిత, మాధవి, కో ఆర్డినేటర్ నగేష్, పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 4: వర్షాకాలంలో అంటువ్యాధులు, విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు డెంగ్యూ నివారణ చర్యలను మన ఇంటి నుంచే మొదలు పెడదామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌వో అనిత, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జ్వరం, మలేరియా సంబంధిత వ్యాధిగ్రస్తులు వచ్చిన సమయంలో వారి వివరాలతో నివేదికలు సమర్పించడంతోపాటు వారి నివాస ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని, వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, సూచించారు. డెంగ్యూ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. డీపీవో వెంకటేశ్వర్ రావు, ఆర్ఎంవో భీష్మ, సర్వేయలెన్స్ అధికారి ఫయాజ్, వైద్యాధికారి స్వస్తికజైశ్వాల్ పాల్గొన్నారు.

వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయాలి

వన మహోత్సవం లక్ష్యాలను ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌వో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వన మహోత్సవం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ పథకంలో ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగు నీటిని అందించాలన్నారు.

బడీడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

లక్షెట్టిపేటరూరల్: ప్రభుత్వం చేపట్టిన బడిబాటలో బడి వయస్సు గల పిల్లలందరు తప్పనిసరిగా పాఠశాలకు రావాలని, ఆ దిశగా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బలరావుపేట గ్రామపంచాయతీని తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పిల్లల నమోదు, హాజరు వివరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడి బయట, మధ్యలో బడి మానేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను వివరించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిష్టర్‌లు, పిల్లల ఆరోగ్యస్థితిగతులను తెలుసుకున్నారు. వన మహోత్సవంలో నాటిన మొక్కల వివరాలను పరిశీలించారు. పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి


కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 4: తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య తనకంటూ చెరగని ముద్ర వేసుకుని చిరస్మరణీయుడిగా నిలిచాడని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య త్యాగం నేటి తెలంగాణ సమాజానికి మేలు చేసిందన్నారు. నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం వీరోచిత పోరాటాలు చేశారని, వెట్టిచాకిరి నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు విశేషంగా కృషి చేశారన్నారు అదనపు కలెక్టర్ మోతిలాల్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వినోద్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమురయ్య చేసిన సేవలను కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గసభ్యుడు నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బాబు, రాజమౌళి, లక్ష్మీనారాయణ, ఉపేందర్, ఐలయ్య, రాంచందర్, తిరుపతి రాములు, రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, సతీష్ పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వులు రద్దు

ఏసీసీ, జూలై 4: చెన్నూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు సౌజన్యకు ఇటీవల చేపట్టిన పదోన్నతులు, బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. ఈ మేరకు సౌజన్యను జన్నారం మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా కలమడుగు ఉత్తర్వులను రద్దు చేయించుకుని వేమనపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు బదిలీ ఉత్తర్వులు తెచ్చుకుంది. ఈ ఉత్తర్వులపై వివాదం నెలకొనడంతో స్పందించిన డీఈవో యాదయ్య వేమనపల్లి పాఠశాలకు ఇచ్చిన బదిలీ ఉత్తర్వులను రద్దు చేస్తూ తిరిగి కలమడుగు పాఠశాలకు బదిలీ చేసిన ఉత్తర్వులను పునరుద్ధరించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఏసీసీ, జూలై 4: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందడానికి మిగిలిన సీట్ల కోసం రెండోదశ అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మొదటి దఫాలో సీటు రాని వారు ఆప్షన్స్ ఇస్తే సరిపోతుందన్నారు. మొత్తం 188 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మందమర్రిరూరల్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దేవానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్స్ సివిల్, డీజిల్ మెకానిక్‌లలో సీట్లు ఉన్నాయని తెలిపారు.

శ్రీరాంపూర్: రెండో విడత ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ ఫీజు రూ.100 చెల్లించి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడీని వినియోగించాలని, ఐటీఐ పూర్తయ్యే వరకు ఫోన్ నెంబర్, మెయిల్ ఐడీని మార్చకూడదని కోరారు. కోపా, డీజిల్ మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో సీట్లున్నాయన్నారు.

మండల ప్రత్యేకాధికారులు వీరే...

హాజీపూర్, జూలై 4: హాజీపూర్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా డీఈవో యాదయ్య గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సభ్యుల పదవి కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో మల్లయ్య, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

జైపూర్: మండల ప్రత్యేకాధికారిగా జడ్పీ సీఈవో గణపతి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సత్యనారాయణ, సిబ్బంది ఆయనను సన్మానించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు.

కాసిపేట: మండల ప్రత్యేకాధికారిగా డీటీడీవో గంగారాం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. అనంతరం అధికారులు ప్రత్యేకాధికారిని సన్మానించారు.

భీమిని: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మండల సిబ్బంది సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషిచేస్తామన్నారు. ఎంపీడీఓ గంగమోహన్, ఏపీఓ భాస్కర్ రావు, జూనియర్ అసిస్టెంట్ లలిత, ఈసీ సత్యనారాయణ, ఉన్నారు.

నెన్నెల: మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఎస్ఎల్ఆర్ఎస్ ఏడీ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నవీన్, ఏపీఎం విజయలక్ష్మిలు సన్మానించారు.

కన్నెపల్లి: మండల ప్రత్యేకాధికారిగా పరిశ్రమల శాఖ అధికారి హరినాథ్ బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

వేమనపల్లి: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

దండేపల్లి: మండల ప్రత్యేకాధికారిగా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి నాయకులు కృషి చేయాలన్నారు.

భీమారం: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి చిన్నయ్య బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, మిషన్ భగీరథ ఏఈ విద్యాసాగర్, ఏపీవో జీనత్, పాల్గొన్నారు.

మెట్టు మెట్టుకు చెత్త..

- కలుషితమవుతున్న గూడెం గోదావరి నది
- గోదావరి పుష్కరఘాట్ మెట్లపై పేరుకుపోయిన చెత్త చెదారం


గోదావరి పుష్కరఘాట్ మెట్లపై పేరుకుపోయిన చెత్త

దండేపల్లి, జూలై 4: మండలంలోని గూడెం గోదావరి నది వద్ద పారిశుధ్యం లోపించింది. పుష్కరఘాట్ల వద్ద ఉన్న మెట్లపై చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో పుణ్యస్నానం ఆచరించేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్లపైన ఉన్న చెత్త నీటిలో పడుతోంది. పుణ్యస్నానం చేసేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల-జగిత్యాల రెండు జిల్లాల సరిహద్దులో ఉండడం, పలు ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు పుణ్యస్నానం చేసేందుకు ఇక్కడి వస్తుంటారు. గూడెం సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించేందుకు భక్తులు పలుప్రాంతాల నుంచివస్తుంటారు. నదిస్నానం అనంతరం ఆలయాలను సందర్శించారు. పుష్కరఘాట్లపై పేరుకు పోయిన చెత్తను తొలగించడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో భక్తులు ఇబ్బందుల నడుమ పుణ్యస్నానం ఆచరిస్తున్నారు. అధికారులు స్పందించి పుష్కరఘాట్లపై పేరుకపోయిన చెత్తను తొలగించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని నదిలో పుణ్యస్నానం ఆచరించే భక్తులు కోరుతున్నారు.


గూడెం గోదావరి నదిలో పేరుక పోయిన చెత్తచెదారం


గోదావరి పుష్కరఘాట్‌లో భక్తులు వేసిన చెత్త

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి

బెల్లంపల్లి(తాండూర్), జూలై 4: వాహనాలకు నంబర్‌ప్లేట్ తప్పనిసరిగా కనబడే విధంగా అమర్చుకోవాలని సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం ఐబీ కేంద్రంలో ఎస్‌ఐ కిరణ్‌కుమార్‌తో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. నెంబరు ప్లేట్ సరిగ్గా లేని వాహనాలను సర్కిల్ కార్యాలయానికి తరలించి వాహన యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ఏ వాహనానికైనా నెంబరు ప్లేటు తప్పని సరిగా ఉండాలని, లేకుంటే అట్టి జరిమానా విధిస్తామన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, వాహనాలు చోరీకి గురైనప్పుడు నెంబరు ప్లేట్ ఉంటే గుర్తించవచ్చని తెలిపారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్‌తోపాటు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కుమారస్వామి

చల్లంగ చూడు పెద్దమ్మతల్లి

నర్సాపూర్‌లో ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

దండేపల్లి, జూలై 4: మా ఊరిని.. మా పిల్లపాపలు.. కుటుంబ సభ్యులను చల్లంగా చూచి, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పండేలా చూడాలని కోరుతూ దండేపల్లి మండలం నర్సాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో పెద్దమ్మ, పెద్దయ్య ఆలయ విగ్రహా ప్రతిష్ఠాపన చేశారు. కుటుంబ సమేతంగా నైవేద్యాలు పట్టుకుని ప్రదక్షణ చేసి పెద్దమ్మతల్లికి సమర్పించారు. అనంతరం తల్లికి మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం

ఏసీసీ, జూలై 4 : మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ, పదోన్నతిపై వెళ్తున్న టీచర్లు సరిగొమ్ముల సంగీత, ఇరుకుల్ల శ్రీలేఖను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీంరావు, టీచర్లు, విద్యార్థులు గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠాలు బోధించడంతోపాటు సంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో టీచర్లు ముందున్నారన్నారు. అలాగే పదోన్నతి వచ్చినా వేరే పాఠశాలకు వెళ్లకుండా గర్మిళ్ల పాఠశాలనే ఎంచుకున్న టీచర్లు గంగుబాయిదేశ్‌పాండే, గోమాస వరలక్ష్మీ పాఠశాలపై అభిమానాన్ని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడెకు అంత్యక్రియలు

మంచిర్యాల అర్బన్, జూలై 4: పట్టణంలోని చున్నంబట్టివాడకు చెందిన శ్రీనివాస్ పెంచుకున్న కోడె మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించాడు. అంత్యక్రియలు నిర్వహించి కోడెపట్ల తనకుఉన్న ప్రేమను చాటుకున్నాడు. 8యేండ్ల క్రితం తిరుపతి సమీపంలోని పుంగనూరు నుంచి కోడెను కొనుగోలు చేశానని, దాంతో పాటు పుంగనూరు ఆడ ఆవు కూడా ఉందని, వాటికి 12దూడలు జన్మించాయని తెలిపారు. బుధవారం అస్వస్థతకు గురై మృత్యువాత పడిందని తెలిపారు. కోడె మృతి చెందగా అంత్యక్రియలు చేశానని ఆయన తెలిపారు.

పాదయాత్ర

జన్నారం, జూలై 4 : జన్నారం మండల మీదుగా భారీ వాహనాల రాకపోకలను అనుమతించాలని గురువారం సామాజిక కార్యకర్త భూమాచారి కలమడుగు గ్రామంలో పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలను అనుమతించకపోవడంతో మండల అభివృద్ధి కుంటు పడిందన్నారు. ప్రభుత్వం మండలం మీదుగా వాహనాల రాకపోకలను అనుమతించాలన్నారు.

సేవలు సంతృప్తినిచ్చాయి


పెంచికలపేటలో ఎంపీపీ, జడ్పీటీసీల, ఎంపీటీసీలను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

పెంచికలపేట, జూలై 4: అయిదేళ్లపాటు ప్రజాసేవలో చేపట్టిన సేవలు సంతృప్తినిచ్చాయని ఎంపీపీ సుజాత, జడ్పీటీసీ సరిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ తమపై నమ్మకాన్ని పెట్టుకొని గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ కమల, ఎంపీటీసీలు చంద్రమౌళి, సంజీవ్, సుధాకర్,రాజన్న,బండన్న పాల్గొన్నారు.

తిర్యాణి: పదవులులేకున్నా ప్రజలతో మమేకమై ఉంటామని ఎంపీపీ శ్రీదేవి, జడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పదవీకాలం పూర్తిచేసుకున్న ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవులు లేకున్నా తాము ప్రజా సేవలోనే ఉంటామని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, పీఏసీ ఎస్‌చైర్మన్ శ్రీని వాస్, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, ఎంపీవో సుధాకర్ రెడ్డి, ఏపీఎం సదానందం పాల్గొన్నారు.


తిర్యాణిలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న నాయకులు

జైనూర్: మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజలకు సేవలందించామని తాజామాజీ ఎంపీపీ కుంర తిరుమల అన్నారు. మండలపరిషత్‌సమావేశ మందిరంలో పదవీవిరమణ పొందిన ఎంపీటీసీలకు గురువారం అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామకార్యదర్శులు, తాజామాజీ సర్పంచులు, ఎంపీడీవో సిబ్బంది తదితరులు గౌరవసభ్యులను ఘనంగా సన్మానించారు.

బీటీ రోడ్లు మంజూరు చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న కుమ్ర భీం రావు

సిర్పూర్(యు), జూలై 4: మండలంలోని బండేయర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో బీటీ రోడ్లు మంజూరు చేయాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో మండల వీటీడీఏ చైర్మన్ కుమ్రభీంరావు వినతిపత్రం అందించారు. మండలంలోని బండేయేర్ నుంచి రూద్రకసా, బండేయర్ నుంచి కుండాయ్ జలపాతం వరకు బీటీ రోడ్లు మంజూరు చేయలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కకు గతంలోనే వినతి పత్రం ఇచ్చామన్నారు. దీనిపై మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించారన్నారు.

రేపు జాబ్ మేళా

సిర్పూర్(యు), జూలై 4: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల అవరణలో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మిట్ట వెంకట్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ మోడల్ స్కూల్,ఎబిఎస్‌ఈసిటీ ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్ సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ జాబ్ మేళాకు 18 సంవత్సరాలు పైబడి,10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్నా యువతి యువకులందరు అర్హులు,ఈ జాబ్ మేళాకు హైదరాబాద్ నుంచి ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీలు హాజరవుతున్నారు.ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగించుకోవాలని కోరారు.

నడిరోడ్డుపై ఆగిపోయిన కంకర లారీ

- 5గంటలపాటు రాకపోకలకు అంతరాయం


రోడ్డు మధ్యలో నిలిచిన లారీ


నిలిచిపోయిన ట్రాఫిక్

చింతలమానేపల్లి, జూలై 4: మండలంలోని కర్జవెల్లి గ్రామసమీపంలో గల ముసలమ్మగుట్ట అటవీ ప్రాంతంలో ప్రధానరోడ్డుపై కంకర లారీ ఆగిపోవటంతో ప్రయాణికులకు దాదాపు అయిదు గంటలపాటు అంతరాయం కలిగింది. కౌటాల మండలం ముత్తంపేట గ్రామం నుంచి కంకరలోడ్‌తో గూడెం వైపు వెళ్తున్న లారీలో రాత్రి 2గంటలకు డీజిల్ అయిపోయింది. దీంతో లారీ రోడ్డుమధ్యలో ఆగిపోయింది. లారీ రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో వెనకవస్తున్న వాహనాలకు ముందుకెళ్లే దారిలేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులద్వారా విషయం తెలుసుకున్న ఏఎస్సైయాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని వాహనానికి మరమ్మ తులు చేయించి ట్రాఫిక్‌క్లియర్ చేశారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

మేస్త్రీ సంఘం నాయకుడికి నివాళులు

జైనూర్, జూలై 4: మండల కేంద్రానికి చెందిన మేస్త్రీ సంఘం నాయకుడు మౌలఖాన్ గురువారం అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన మృతదేహనికి ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్, యునియన్ మండల అధ్యక్షుడు ఢడేకర్ దయానంద్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మారుమూల గ్రామాల్లో తాపీ మేస్త్రీలను ఐక్యంచేసి వారిసమస్యల పరిష్కారం కోసం మౌలాఖాన్ కృషి చేశారని అన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షపాతం నమోదు

ఆసిఫాబాద్, జూలై 4: జిల్లాలో గురువారం 0.2మిల్లీమీటర్ల తేలికపాటి వర్షపాతం నమోదు అయింది. జైనులో 1మిల్లీమీటర్లు, సిర్పూర్(యు)లో 0.7, రెబ్బెనలో 0.4, వాంకిడిలో 0.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ


డీసీపీకి స్వాగతం పలుకుతున్న ఎస్‌ఐ

జన్నారం, జూలై 4: జన్నారం పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ భాస్కర్ గురు వారం తనిఖీచేశారు. డీసీపీకి పోలీసులు స్వాగతం పలికారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. ప్రజలతో సత్సం బంధాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్‌ఐ రాజవర్ధన్ పోలీసులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు చోరీ

దండేపల్లి, జూలై 4: లింగాపూర్ గ్రామానికి చెందిన భూక్య యమున బాయి అనే వృద్ధురాలి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగలు అపహరించారు. గురువారం తెల్లవారుజామున వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి పుస్తెలతాడు లాక్కొగా వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చే సరికి పారిపోయారు. వృద్ధురాలి భర్త లేకపోవడం, ఇద్దరు కుమారులు ఉద్యోగరీత్యా వేరే చోట ఉండటంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై భూమేష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెన్నెల, జూలై 4: చిన్నవెంకటాపూర్ గ్రామానికి చెందిన చెల్కల విజయ (35) అనే మహిళ బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. విజయ మూడేళ్లుగా కిడ్నీల్లో రాళ్లు రావడంతో తీవ్రమైన నొప్పితో బాధ పడుతోంది. 20 రోజుల కిందట ఆపరేషన్ చేసి రాళ్లు తొలగించారు. కొలుకున్న విజయ పత్తి విత్తనాలు వేయడానికి వెల్లగా అక్కడ మరోసారి నొప్పి వచ్చింది. బాధ భరించలేక చేను వద్ద ఉన్న పురుగుల మందు తాగి అక్కడే పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు మం చిర్యాలకు తరలించారు. డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

గంజాయి పట్టివేత

బెల్లంపల్లి, జూలై 4: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద మందమర్రికి చెందిన రవితేజ అనే వ్యక్తిని తనిఖీ చేయగా అతని సంచిలో 2 కిలోల గంజాయి దొరికినట్లు టూ టౌన్ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. తమకందిన సమాచారం మేరకు చంద్రపూర్‌లో గంజాయి కొనుగోలు చేసి రైలులో మందమర్రికి తీసుకువస్తున్న క్రమంలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో దిగగా గంజాయిని, నిందితున్ని పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి రవాణా చేసినా, సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

చెన్నూరులో పోలీసుల విస్తృత తనిఖీలు


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, జూలై 4: చెన్నూరు పట్టణంలో గురువారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. తెలంగాణ చౌరస్తా, బైపాస్ రోడ్డు, జాతీయ రహదారి, అంబేద్కర్ చౌక్, చెరువు కట్ట రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. ధ్రువపత్రాలు, నంబరు ప్లేట్ లేని వాహనాలను, త్రిబుల్ రైడ్ వెళ్తున్న బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహన పత్రాలను ఉండాలని, వెనుక, ముందు నెంబరు ప్లేట్లు ఉండా లని, హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. సీఐలు రవీందర్, సుధాకర్, ఎస్‌ఐలు వెంకటేశ్వర్‌రావు, శ్వేత, పోలీసులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 4: విద్యాసంస్థల బంద్ గురువారం జిల్లాలో విజయవంతమైందని తెలంగాణ జన సమితి విద్యార్థి జిల్లా అధ్యక్షుడు సిరాజ్, బచ్చలి ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపరు లీకేజీ అయినందున మళ్ళీ పరీక్ష నిర్వహించాలని కోరారు. నాయకులు శ్రీకాంత్, అభినవ్, సన్నిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ: జిల్లాలో విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కేజీ టూ పీజీ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో పాఠశాలల నుంచి మొదలుకుని డిగ్రీ, పీజీ కళాశాలల వరకు మూసివేశారు.

కాసిపేట: మండలంలో విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రజిత మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని, పరీక్ష రద్దు చేసి మళ్ళీ నిర్వహించాలన్నారు.

కన్నెపల్లి: నీట్ పరీక్ష పత్రాల లీకేజీని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలలను మూసివేయించారు. నాయకులు మనోహర్, ప్రణయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఈ విషయంపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. రాహుల్, దినేష్,ప్రణయ్, ప్రదీప్, అంజి, నాగేష్ పాల్గొన్నారు.

చెన్నూరు: నీట్ పరీక్ష లీకేజీకి నిరసనగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పట్టణంలో విజయవంతమైంది.

జైపూర్: నీట్ పరీక్ష పేపరు లీకేజీలను నిరసిస్తూ విద్యాసంస్థలను ఎస్ఎస్‌యూఐ నాయకులు బంద్ చేయించారు. మండల అధ్యక్షుడు అహ్మద్‌పాషా మాట్లాడుతూ పేపర్ల లీకేజీతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మణికంఠ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే



చెన్నూరు, జూలై 4: మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని తాజుద్దీన్ బాబా దర్గాలో గురువారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

షీటీంపై అవగాహన

చెన్నూరు, జూలై 4: చెన్నూరులోని కేజీబీవీ పాఠశాలలో ఎస్‌ఐ శ్వేత షీటీంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థినులను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే షీటీంకు కానీ డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. అనంతరం వేధింపులకు గురైతే ఎలా ఫిర్యాదు చేయాలి, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 గురించి వివరించారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

బెల్లంపల్లి, జూలై 4: మంచిర్యాల డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి ఎస్ఎస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కోచ్ సంతోష్ తెలిపారు. గురువారం ఉదయం తిలక్ స్టేడియంలో విద్యార్థులను వాకర్స్ సభ్యులు అభినందించారు. పోటీల్లో చిన్మయి, ఆరాధాన, చాణక్య, అనన్య, సానియా, తమన్నా, సోఫియాభానులు విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 7న హైద్రాబాద్ గచ్చిబౌళిలోని బాలయోగి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వాకర్ సభ్యులు నగేష్, శ్రీనివాస్, పురుషోత్తం, శ్రీకాంత్, శ్రావణ్, మల్లేష్, క్రాంతి పాల్గొన్నారు.

యశోద ఆసుపత్రిలో అరుదైన వైద్యం


మాట్లాడుతున్న వైద్యుడు కరుణకుమార్

మంచిర్యాల అర్బన్, జూలై 4: నస్పూర్‌కు చెందిన రవికుమార్ అప్లాస్టిక్ అనీమియాతో బాధపడుతుండగా ఆయనకు సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించామని ఆసుపత్రి కన్సల్‌టెంట్ హెమటాలజిస్టు, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ కరుణకుమార్ తెలిపారు. గురువారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో చికిత్సకు వివరాలను ఆయన వెల్లడించారు. రవికుమార్ ఫిబ్రవరి 27 నుంచి కామెర్లకు ఆయుర్వేద వైద్యం చేయించుకున్నాడని, అయినా నయం కాకపోవడంతో యశోద ఆసుపత్రిలో చేరారని తెలిపారు. అతడి సోదరుడి బోన్ మ్యారో పూర్తిస్థాయిలో మ్యాచ్ కావడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చేయగా కోలుకున్నాడని ఆయన వెల్లడించారు. ప్రాణాపాయ స్థితి నుండి రక్షించిన వైద్యుడికి రోగి, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

కాసిపేట, జూలై 4 : గత నెల 23న సిద్దిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ జంజిరాల విజయ్‌కుమార్ మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అన్నారు. గురువారం కాసిపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట వద్ద లారీకి మరమ్మతు చేసుకుంటుండగా వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ విజయ్‌కుమార్ మృతిచెందాడని తెలిపారు. నిరుపేద లారీ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. లారీ రాయల్ ట్రాన్స్‌పోర్టు యాజమాని యూనియన్ చర్చలు జరపగా రూ. 1.25 లక్షల నగదుతోపాటు మృతుడి కుటుంబానికి ఒక నెల జీతం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఖదీర్, దుర్గయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

మూడు గంటల పాటు ఇబ్బందులు

మంచిర్యాల అర్బన్, జులై 4 : జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో బుధవారం విద్యుత్ సమస్య తలెత్తింది. సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గడంతో బాలింతలు, శిశువులు, గర్భిణులు, వారి సహాయకులు ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేసే లైన్‌లో సమస్య తలెత్తడంతో సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జనరేటర్ సహాయంతో విద్యుత్‌ను సరఫరా చేశారు. రాత్రి 9 గంటలకు విద్యుత్ లైన్‌ను సరిచేసే పనులు ప్రారంభించగా జనరేటర్‌ను కూడా ఆపివేయడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సుమారు 3 గంటల పాటు పనులు జరగడంతో ఇబ్బందులు పడ్డారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి


క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం

మందమర్రిటౌన్, జూలై 4: ఆత్మరక్షణ కోసం యువతులు కరాటే నేర్చుకోవాలని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. హైద్రాబాద్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్ హాల్‌లో కీర్తి అకాడమీ వారు నిర్వహించిన అటెంప్ట్ టూ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు కళాకీర్తిశిఖర్ అవార్డుతో పాటు సర్టిఫికెట్‌ను కైవసం చేసుకున్న కరాటే మాస్టర్ శ్రీనివాస్, క్రీడాకారులను గురువారం జీఎం కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, రమేష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా హైమాస్ట్ లైట్లు

చెన్నూరు, జూలై 4 : జాతీయ రహదారి 63 బైపాస్ రోడ్డుపై హైమాస్ట్ లైట్‌లు ఏర్పాటు చేసినప్పటికి వాటికి కనెక్షన్ మరిచారు. జాతీయ రహదారి 63 విస్తరణ పనుల్లో భాగంగా పట్టణంలోని గెర్రె ప్రాంతం జాతీయ రహదారి అస్నాద్ చౌరస్తా వద్ద రహదారిపై అధికారులు హైమాస్ట్ లైట్లను రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. నేటికి వాటికి కనెక్షన్ ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినప్పటికీ సంబంధిత జాతీయ రహదారి అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి వాటిని ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా ఎందుకు వదిలేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్క నాటి నీరు పోస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి

జైపూర్, జూలై 4: మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే1ఏ గని ఆవరణలో జీఎం సంజీవ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పుట్టిన రోజులు, పెళ్లి రోజుల సందర్భంగా వారి నివాస పరిసరాల్లో మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. చెట్లు ఎన్ని ఎక్కువంటే ఎక్కువ వర్షాలు పడతాయన్నారు. సింగరేణి యాజమాన్యం మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుండడం సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో కూడా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అటవీ శాఖ డివిజనల్ అధికారి వినయ్‌కుమార్ సాహూ, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జీ ఎస్‌వోటూ జీఎం ఏవీ రెడ్డి, ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మృతిచెందిన పసికందు

- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబసభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలంటూ రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్, జూలై 4: డాక్టర్ నిర్లక్ష్యంతో తమకు పుట్టినబిడ్డ మృతిచెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారం రాస్తారోకో చేశారు. వివరాల్లోకి వెళితే.. దహెగాం మండలం కల్వాడకు చెందిన సవిత గర్భవతి కావటంతో పరీక్షల కోసం నాలుగు రోజుల క్రితం కాగజ్ నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి వచ్చింది. అయితే ఆస్పత్రి సిబ్బంది నెలలు నిండాయని ఆపరేషన్ చేస్తామని ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ఆపరేషన్ అనంతరం పుట్టిన పసికందు ఆరోగ్యపరిస్థితి విషమించటంతో స్థానిక పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ గురువారం ఉదయం పసికందు మృతిచెందింది. కేవలం వైద్యుల నిర్లక్ష్యంతోనే తమబిడ్డ మృతిచెందిందని తండ్రి రమేష్ రోధిస్తూ తెలిపాడు. ఎనిమిది నెలలు కూడా నిండకముందే తన భార్యకు ఆపరేషన్ చేశారని ఆరోపించాడు. అయితే నెలలు నిండి ఆపరేషన్ అవసరమైతేనే చేశామని, ఇందులో తమ తప్పే మి లేదని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోవటంతో సంఘటన స్థలానికి సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య చేరుకొని కుటుంబసభ్యులను సముదాయించటంతో రాస్తారోకో విరమించారు.

బొగ్గు గనులను సింగరేణికే అప్పగించాలి


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 4: రాష్ట్రంలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికే అప్పగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. గురువారం బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సింగరేణి వ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 12వరకు నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను ప్రభుత్వ రంగ సంస్థలకు ఇవ్వకుండా ప్రైవేటు సంస్థలకు అప్పగిచ్చేందుకు యోచిస్తోందన్నారు. దీనివల్ల సింగరేణికి భవిష్యత్‌లో మనుగడ ఉండదన్నారు. దీంతో తెలంగాణ ప్రజలకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. బొగ్గుగనులను సింగరేణికే అప్పగించాలని సింగరేణి వ్యాప్తంగా ఈనెల 5నుంచి 12వరకు ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లో వేలం నిర్వహించే కార్యాలయం ఎదుట పెద్దఎత్తున్న ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమాలకు పార్టీ నాయ కులు, కార్యకర్తలు, కార్మికసంఘాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి తిరుపతి, నాయకులు నర్సయ్య, రమేష్, సురేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం: కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్, జూలై 4: మంత్రి సీతక్క పర్యటనలో బీఆర్ఎస్ నాయకులపై తాను దుర్భాషలడినట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మీ చేస్తున్న వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులను దూషించినట్లు ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. ఆదివాసీలను ఎప్పుడు గౌరవిస్తామని దీనికి నిదర్శనమే మంత్రి సీతక్క మూడు పర్యటనల్లో మొదటిది మార్లవాయి, రెండోది జంగుబాయి క్షేత్రం, మూడోది జోడేఘాట్ అని అన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యే అయి ఉండి ఆదివాసీ మంత్రి జిల్లాకు వస్తే తనకు సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారని ఎమ్మెల్యే అనడం రాజ్యంగ విలువలను తుంగలో తొక్కడమేనన్నారు. పదేపదే ఆదివాసీ మహిళ అని చెప్పుకొస్తున్న ఎమ్మెల్యే గతంలో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిని భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు పెట్టలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీఐపీలు పర్యటనకు వస్తే కాంగ్రెస్‌నాయకులను ముందస్తు అరెస్టులు చేసి నిర్బంధించిన సంఘటనలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. దూషించడం తనకు అలవాటు లేదని ఒకవేళ తాను దూషించినట్లు రుజువు చేస్తే బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. ఎమ్మెల్యే తనభాష, పదజాలాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలేశ్వర్‌గౌడ్,అనిల్‌గౌడ్, చిన్న మల్లన్న, మహేష్‌గౌడ్, మునీర్‌అహ్మద్, వసంత్ రావు,డాక్టర్‌రమేష్, కళావతి, చిట్లనారాయణ, గుండా శ్యాం,దత్తు,అసద్,రఫ,ఆసిఫ్‌తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూరు, జూలై 4: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికిచెందిన నాయిని గంగయ్య(65) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గంగయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం ఆసుపత్రుల చుట్టు తిరిగినప్పటికీ నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంటివెనకాల దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. భార్య గమనించగా ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య విమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

నేడు వారసంతకు వేలం

చింతలమానేపల్లి, జూలై 4: మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారసంతకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్ అధ్యక్షతన వేలంపాట నిర్వహిస్తామని కార్యదర్శి ఆసిఫ్ అలీ తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో రూ.10 వేల డిపాజిట్ చేసి పాల్గొనాలన్నారు.

మార్కెట్‌కమిటీ చైర్మన్‌కు సన్మానం

చింతలమానేపల్లి, జూలై 4: మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కాగజ్‌నగర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ దేవయ్యను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పోశయ్య, రామయ్య, సంతోష్, ఎల్లయ్య, శంకర్, సత్తయ్య, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ నిర్మించాలి

ఆసిఫాబాద్‌రూరల్/దహెగాం, జూలై 4: దహెగాం మండలకేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ నిర్మించాలని గురువారం ఆ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆర్టీసీ డీఎం విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బస్సుల కోసం రోడ్డుపై చెట్ల కింద వేచి చూడాల్సిన వస్తోందని డీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే పెంచికల్‌పేట నుంచి దహెగాం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 4: మొక్కల సంరక్షణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో భిక్షపతితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో వనమహోత్సవంలో 53లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రుపొందించామన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 18లక్షలు, ఇతర ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో 35లక్షల మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని ఈజీఎస్ పథకం కింద గుంతల తవ్వకాలను ప్రారంభించాలన్నారు. మిషన్ భగీరథ నీటిసరఫరాపై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సిర్పూర్ పేపర్‌మిల్ నిర్వహణ దృష్ట్యా జిల్లా రైతాంగానికి నీలగిరి, సుబాబుల్ చెట్ల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాంటేషన్ పెంపకం ద్వారా మంచి ఆదాయం వస్తుందని రైతులకు వివరించి ప్రోత్సహించాల న్నారు.

జిల్లాలో విద్యా సంస్థల బంద్ విజయవంతం


ఆసిఫాబాద్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆసిఫాబాద్/వాంకిడి/బెజ్జూరు/కెరమెరి/ చింతలమానేపల్లి/ పెంచికలపేట జూలై 4: జాతీయ పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టీఏ, విద్యా మంత్రిత్వశాఖ బాధ్యతారాహిత్యాన్ని నిరసిస్తూ విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ జాతీయకమిటీ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం జిల్లాకేంద్రంలో, మండలాల్లో విద్యాసంస్థలబంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు జన్కాపూర్‌లోని అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పరీక్షలనిర్వహణలో ఎన్‌టీఏ పూర్తిగా అసమర్థంగా ఉందన్నారు. నీట్ పరీక్షపత్రం లీక్‌చేసి లక్షల్లో అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాలనాయకులు చిరంజీవి,తిరుపతి, ప్రణయ్, అయూబ్, వాంకిడిలోజరిగిన కార్యక్రమంలో విద్యార్థి సంఘాలనాయకులు కార్తీక్‌నిఖిల్, మహేష్, కెరమెరిలో ఎస్ఎఫ్ఐ నాయకులు సతీష్, రాజేందర్, శేఖర్, చింతలమానేపల్లిలో నితీష్‌సాయికిరణ్, పెంచికలపేటలో నవీన్, సాయికిరణ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి, జూలై 4: మండలంలోని బంబార గ్రామ సమీపంలో జాతీయరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బంబార గ్రామానికి చెందిన సాగర్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బంబార గ్రామం నుంచి వాంకిడి వైపునకు మోపెడ్‌పై వస్తుండగా వెనక నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సాగర్‌గౌడ్‌కు బలమైన గాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం అతన్ని కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్సైసాగర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కెలి(కె) వాగులో ఒకరి గల్లంతు

కెరమెరి, జూలై 4: మండలంలోని కెలి(కె)గ్రామ సమీపంలోని వాగులో జైనూరు మండలం సాంబాజీగూడ గ్రామానికి చెందిన జాదవ్ ప్రకాష్(38) గల్లంతయ్యాడు. ప్రకాష్ బైక్‌పై స్వగ్రామం నుంచి మహారాష్ట్రలోని జివితికి వెళుతున్నాడు. కెలి(కె)గ్రామసమీపంలోని వాగు దాటుతుండగా వాగు ఉధృతికి బైక్‌తోపాటు కొట్టుకుపోయాడు. గ్రామస్థులు, పోలీసులు గాలించగా కొద్దిదూరంలో వాహనం లభ్యంకాగా జాదవ్ ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేసి శుక్రవారం ఉదయం గాలించనున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

వాగులో మునిగి మహిళ మృతి

కెరమెరి, జూలై 4: మండలంలోని సూర్దాపూర్ గ్రామ సమీపంలోని వాగులో గురువారం ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చౌదరి జ్యోతి(24) మృతిచెందింది. ఎస్సై గుంపుల విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామసమీపంలోని చేనుకు వ్యవసాయపనులకు భర్త సురేందర్ వెళ్లాడు. భర్తకోసం జ్యోతి భోజనం తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో పెద్దవాగు దాటుతుండగా నీటిలోతు తెలియకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందింది. భర్త సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి విద్యార్థి మృతి

లింగాపూర్, జూలై 4:మండలంలోని కంచన్‌పెల్లి గ్రామానికి చెందిన పదవతరగతి విద్యార్థి ఆత్రం రామకృష్ణ(16) గురువారం స్నానం కోసం బావి వద్దకు వెళ్ళి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడి కటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

దేశీదారు పట్టివేత

వాంకిడి, జూలై 4: మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న దేశీదారును గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం ఆసిఫాబాద్‌కు చెందిన బండారి రాజశేఖర్ గురువారం రాత్రి బస్‌స్టాండ్‌లో బ్యాగు పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతున్నాడన్నారు. అతని దగ్గరికెళ్లి బ్యాగు తనిఖీచేయగా 100దేశీదారుమద్యం సీసాలు (90ఎంఎల్) లభించాయన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని దేశీదారు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజశేఖర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ పోశెట్టి, కానిస్టేబుల్ ధనరాజ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నట్లు అయన పేర్కొన్నారు.

వాంకిడిలో వర్షం

వాంకిడి, జూలై 4: మండలంలో గురువారం సాయంత్రం అరగంటపాటు వర్షం కురిసింది. దీంతో మండలంలోని అంతర్గతరోడ్లు బురదమయంగా మారాయి. వారసంత వర్షానికి బురదమయంగా మారడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు.

ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తునకు వచ్చిన అధికారులు

- మూన్నెళ్లు గడువు కోరిన ఆర్డీవో
- జప్తును వాయిదా వేసిన కోర్టు సిబ్బంది


విలేకర్లకు వివరాలను వెల్లడిస్తున్న కోర్టు సిబ్బంది

కాగజ్‌నగర్, జూలై 4: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు సిబ్బంది గురువారం కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తు చేసేందుకు వచ్చారు. దహెగాం మండలంలోని పాల్వాయి పురుషోత్తమరావు ప్రాజెక్టు భూ నిర్వాసితుల పరిహారం చెల్లింపు విషయంలో తాత్సారం చేస్తుండటంతో హైకోర్టు కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని గతనెల 27న ఆదేశాలను జారీచేసింది. గురువారం ఉదయం సిర్పూరు(టి), ఆసిఫాబాద్ కోర్టు సిబ్బంది కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కోర్టు అధికారి శేఖర్ మాట్లాడుతూ దహెగాం మండలంలోని పీపీరావు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన 24మంది రైతులు పరిహారం కోరుతూ హైకోర్టులో 22ఏళ్ల క్రితం కేసువేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకు వారికి పరిహారం ఇవ్వలేదు. మూడు నెలల క్రితం కూడా పరిహారం విషయంలో హైకోర్టు తిరిగి ఆదేశాలు జారీచేసింది. పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తుండటంతో గతనెల27న ఆర్డీవో కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని హైకోర్టు ఆదేశాలను జారీచేసినట్టు వివరించారు. ఆ ఆదేశాలను అమలు పరిచేందుకు ఇక్కడికి వచ్చినట్టు పేర్కొన్నారు. మొత్తం 24మంది రైతులకు సంబంధించి పరిహారం రూ.5కోట్లకు పైగా ఉన్నట్టు వివరించారు.

చర్చలు జరిపిన అధికారులు..

కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయ చరాస్థి జప్తు చేసేందుకు వచ్చిన కోర్టు అధికారులతో ఆర్డీవో సురేష్ చర్చలు జరిపారు. కోర్టు అధికారి శేఖర్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన ఆర్డర్ కాపీను ఆర్డీవోకు అందజేశారు. ఇక్కడి పరిస్థితులను ఆర్డీవో వెంటనే జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో మాట్లాడారు. మూడు నెలల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అండర్ టేకింగ్ పత్రం ఇవ్వటంతో ఆస్తుల జప్తును వాయిదా వేసినట్టు కోర్టు సిబ్బంది ప్రకటించారు. జప్తు చేసేందుకు వచ్చిన వారిలో న్యాయవాదులు గంటా శ్రీనివాస్, మండల విక్రం రెడ్డి, మునిగెల రాజయ్య, తదితరులున్నారు.

మాజీలయ్యారు!





ఎంపీపీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో జిల్లాలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు ఇక మాజీలయ్యారు. ఇదే సమయంలో వారిస్థానంలో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించి పాలన సాగించనుంది. 5ఏళ్ల నుంచి స్థానికసంస్థల ప్రజాప్రతినిధులకు నిధుల విడుదల విషయమై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిం దన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో చాలామంది ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగానే ఉండిపోయారు.

- చింతలమానేపల్లి

- ముగిసిన స్థానిక ప్రజాప్రతినిధుల కాలం
- ఇక ప్రత్యేక అధికారుల పాలనలోనే మండలాలు
- ఇప్పట్లో స్థానిక సంస్థలు లేనట్లే

జిల్లాలో 15మంది జడ్పీటీసీలు, 15మంది ఎంపీపీ స్థానాలున్నాయి. 123మంది ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీరు గ్రామాల అభివృద్ధిలో ప్రముఖపాత్ర పోషించేవారు. ముందుగా మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాల న్నా మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకొని పలు తీర్మానాలు ఆమోదం పొందిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతోపాటు స్థానికంగా వచ్చే ఆదాయాన్ని ఎంపీడీవోలు డ్రాయింగ్ అధికారిగా ఖర్చు చేయడానికి వీలు ఉంటుంది.

అలాగే కేంద్రం అందించే 15వ ఆర్థికసంఘం నిధులు ఎంపీడీవోలతోపాటు ఎంపీపీలు సంయుక్తంగా డాంగిల్ ఖర్చు చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎంపీపీల పదవీకాలం ముగియడంతో వారిస్థానంలో ప్రత్యేకాధికారులను నియ మించారు. ఇకనుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా ప్రత్యేకాధి కారుల అనుమతి పొందాల్సి ఉంటుంది. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి కొత్తగా పాలకవర్గం ఏర్పాటయ్యే వరకు ప్రత్యేకాధికారుల పాలన సాగనుంది.

ఇప్పట్లో ఎన్నికలు లేనట్లే..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఎందుకంటే వరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో కోడ్ అమల్లో ఉండడంతో పలు అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. దీంతో పంచాయతీల పదవీకాలం ఫిబ్రవరితో ముగిసినా ప్రత్యేకాధికారులతోనే పాలన నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని వివిధ మండల స్థాయిలో ఎంపీపీల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించి పాలన సాగించేందుకు జిల్లా స్థాయి గెజిటెడ్ అధికారులను 15 మందిని నియమించారు.

దీంతో ఇప్పట్లో స్థానికసంస్థల ఎన్నికలు ఉండవనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రైతు రుణమాఫీ అమలుతో పాటు బీసీ జనాభా గణన పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబు తోంది. అంతేకాకుండా ఆగస్టునెల వరకు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసి సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో రిజర్వేషన్లు ఖరారు చేసి నవంబరు, డిసెంబరు మాసాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంతో ఆతృతగా ఎదురు చూసిన ఆశావహనేతలకు నిరాశ కన్పిస్తోంది.

ప్రత్యేకాధికారుల పాలనలో అభివృద్ధి జరిగేనా?

జిల్లాలోని 15మండలాల పరిధిలో 15మందిని ప్రత్యేకాధికారులుగా నియమించారు. అయితే వీరితో గ్రామాల్లోని పలు సమస్యలకు పరిష్కారం లభించేనా అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రత్యేకాధికారులు మండలాలు, గ్రామాల్లో సమస్యలు ఎలా పరిష్కరిస్తారన్నది ప్రశ్నార్థకం. గ్రామాల్లోనూ ఇప్పుడు ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఇప్పటికీ చాలా గ్రామాల్లో వారానికి ఒక్కసారి కూడా సర్పంచుల స్థానాల్లో ఉన్న ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, తాగునీరు, భారీ వరదలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నది. అయితే వీటికి తోడు సంక్షేమ పథకాల అమలు, నిధుల మంజూరులో జాప్యంతో ప్రత్యేకాధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నదని పలువురు పేర్కొంటున్నారు.


ఎంపీపీ పదవీ కాలం పూర్తైన సందర్భంగా సన్మానిస్తున్న అధికారులు (ఫైల్)

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు పాటుపడదాం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ఆసిఫాబాద్, జూలై 4: తెలంగాణసాధన పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య ఆశయసాధనకు అందరం కలిసికట్టుగా పాటు పడుదామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ కలిసి కొము రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధుడిగా దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వారి ఆశయాల సాధనకు అందరం కలిసి సమష్టిగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికారులు, జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లి కార్జున్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ


కెరమెరిలో దివ్యాంగురాలికి వీల్‌చైర్, బియ్యం పంపిణీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కెరమెరి/లింగాపూర్/సిర్పూర్(యు), జూలై 4: కెరమెరి, లింగాపూర్, సిర్పూర్(యు) పోలీసుస్టేషన్‌లను గురువారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్‌రైటర్, ఎస్‌హెచ్‌వో, రెస్ట్ రూం, లాక్‌అప్ రూంలను పరిశీలించారు. 5ఎస్ అమలు తీరును పరిశీలించారు. పోలీసుస్టేషన్‌లో ఎంతమంది సిబ్బంది ఉన్నారు, వారు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీసు స్టేషన్ నుంచి రోజు ఎన్ని బ్లూకోల్ట్స్, పెట్రోకార్స్ విధులు నిర్వహిస్తున్నారని, పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బీట్స్ నడుస్తున్నాయని తెలుసుకుని ప్రాపర్‌గా పెట్రోల్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగురాలు సిడాం పగ్గుబాయికి వీల్‌చైర్, బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఫిర్యాదుదారులు పోలీసుస్టేషన్లకు వచ్చినప్పుడు వారితో ఆప్యాయంగా మాట్లాడి సత్వరమే వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచిం చారు. అదేవిధంగా డయల్ 100కు ఫోన్ వస్తే వెంటనే స్పందించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ సదయ్య, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, సీఐ శ్రీనివాస్, ఎస్సై విజయ్ ఉన్నారు.

పురుగుల మందు తాగిన ఘటనలో.. ఇద్దరు మంచిర్యాల ఆస్పత్రికి తరలింపు

కాగజ్‌నగర్, జూలై 4: మండలంలోని గజ్జిగూడలో నాలుగు రోజుల క్రితం భర్త వేధింపులు తాళలేక తల్లి, ముగ్గురు కూతుళ్లు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనలో బుధవారం తల్లి అనిత(55), కూతురు రమ్య(16) మృతి చెందగా, మిగిలిన ఇద్దరు లక్ష్మి(21), ఐశ్వర్య(14) పరిస్థితి విషమంగా ఉండటంతో గురువారం మెరుగైనచికిత్సకోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

మురుగునీటిని తొలగించిన అధికారులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


కాలువ తవ్వుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

పెంచికలపేట, జూలై 4: మండలంలోని గుంట్లపేట గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక రహదారిపై మురుగు నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'నడిచి వెళ్లేదెలా?' కథనానికి అధికారులు స్పందించారు. గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందితో గురువారం దారిపై నిలిచిన మురుగు నీరును తొలగించారు.

సంపూర్ణ అభియాన్ లక్ష్యాలను సమష్టిగా సాధిద్దాం: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతూ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 4: జిల్లాలో సంపూర్ణ అభియాన్ లక్ష్యాలను సమన్వయంతో కృషిచేసి పూర్తి స్థాయిలో సాదిద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, జిల్లా అటవీఅధికారి నీరజ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి నీతిఅయోగ్ సంపూర్ణ అభియాన్ లక్ష్యాల సాధనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీతి అయోగ్‌లో భాగంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్యవైద్యం, వ్యవసాయం, స్వయం సహాయకసంఘాల అభివృద్ధి, మహిళా శిశుసంక్షేమం, సంబంధిత అంశాలపై సంపూర్ణ అభియాన్ ద్వారా ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. గర్భం దాల్చిన మహిళలు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వివరాలు నమోదు చేసుకుని ప్రతినెల సమయాను సారంగా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. పౌష్టికాహారం, మందులు సకాలంలో తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. డయాబెటిస్, హైపర్ టైన్షన్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఆసుపత్రులకు వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో భూసార పరీక్షలు చేయంచుకొని కార్డులను పొందాలన్నారు. పరీక్ష నివేదిక ఆధారంగా సాగు చేయాల్సిన పంటలపై రైతులకు మెలుకువలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఒక సంవత్సరం లోపు పిల్లలందరికీ వందశాతం టీకాలు వేయించాలని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత నందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. సెప్టెంబరు 30వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నిర్దేశిత అంశాలపై అధికారులు సమష్టిగా పని చేసి జిల్లాను అభివృద్ధి పథకంలో ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం గ్రామీణాభివృద్ధి, విద్య, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.

కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జడ్పీటీసీలు నాగేశ్వర్‌రావు, శ్రీరామరావు, సంతోష్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు తుకారాం, జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఏపీడీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విధులకు హాజరు కాకపోతే ఉద్యోగాలు కోల్పోతారు



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, జూలై 4: కార్మికులు గైర్హాజరైతే ఉద్యోగాలు కోల్పోయే అవకాశాలు ఉంటాయని మందమర్రి జీఎంమనోహర్ తెలిపారు. గురువారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఏరియాలోని కేకే5, ఓసీపీ,కాసిపేట1,2 గనుల గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 100మస్టర్లు లేకపోతే నాగాల పేరిట ఉద్యోగం నుంచి తొలగించబడతారని తెలిపారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏరియాలో 380మంది గైర్హాజరు కార్మికులుండగా కౌన్సెలింగ్‌కు 117మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి,ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సేవా సమిత అధ్యక్షురాలు సవితమనోహర్ పాల్గొన్నారు.

సన్మానం

ఆర్జీ2 రెస్క్యూ జీఎంగా బాధ్యతలు స్వీకరించి గురువారం మందమర్రి రెస్క్యూస్టేషన్‌కు వచ్చిన శ్రీనివాసరెడ్డిని మందమర్రి ఏరియా జీఎం మనోహర్, అధికారులు ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. రెస్క్యూస్టేషన్ వివరాలు తెలుసుకున్నారు.

అధిక ఉత్పత్తి సాధన కోసమే ఎస్‌డీఎల్ యంత్రాలు

మందమర్రిటౌన్, జూలై 4: అధిక బొగ్గు ఉత్పత్తి సాధన కోసమే నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను ఏర్పాటు చేశామని కేకే5 గని మేనేజర్ అల్లావుద్దీన్ తెలిపారు. గురువారం కేకే5 గనిపై రూ.1.56 కోట్లతో కొనుగోలు చేసిన 3ఎస్‌డీఎల్ యంత్రాలకు గనిపై అధికారులతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డీఎల్ యంత్రాలతో రికార్డు స్థాయి ఉత్పత్తిని సాధించాలన్నారు. అధికఉత్పత్తి సాధించే ఎస్‌డీఎల్ ఆపరేటర్లను యాజమాన్యం ప్రోత్స హిస్తుందన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి రమేష్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, పిట్ ఇంజనీర్లు నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గనుల వేలాన్ని వెంటనే ఆపాలి

శ్రీరాంపూర్, జూలై 4: బొగ్గు గనుల వేలంను వెంటనే ఆపాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేసి, జీఎం బి సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గుగనులను వేలం వేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీనికలిసి బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయసమితి సభ్యుడు సీహెచ్ భీంరావు, కేంద్రఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, ఉప ప్రధానకార్యదర్శి గరిగేస్వామి, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, కేంద్ర కార్యదర్శులు ఎల్ శ్రీనివాస్, సమ్మయ్య, మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి భీమ్ రవి, జిల్లా ఉపాధ్యక్షుడు జెనర్సింగ్, నాయకులు పాల్గొన్నారు.

సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలి..

మందమర్రిటౌన్: బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించాలని మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య మాట్లాడుతూ గనులను వేలం వేయడం అంటే పెట్టుబడి దారుల ఆస్తులను పెంచడమేనని తెలిపారు. వేలం పాటలు రద్దుచేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, సూర్యనారాయణ, శంకర్‌రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.


శ్రీరాంపూర్: జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

బెల్లంపల్లి: బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం శాంతిఖనిగనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వెంటనే బొగ్గు గనులను వేలం రద్దు చేయకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేయాలన్నారు. బొగ్గు గనుల వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల5న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పిఆహ్వానించారు. కార్యక్రమంలో దాగం మల్లేష్, చిప్ప నర్సయ్య, ఐలయ్య, రాంచందర్, దాసరి తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

- **కరపత్రాల విడుదల**

బొగ్గు గనులను వేలం పాటలను వ్యతిరేకిస్తూ ముద్రించిన కరపత్రాలను గురువారం బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేసే పోరాటాలకు కార్మికులందరు కలిసి రావాలన్నారు.

ఎల్లోకార్డు, రెడ్‌కార్డు విధానం రద్దు చేయాలి

మందమర్రిటౌన్, జూలై 4: యాజమాన్యం నూతనంగా ప్రవేశపెట్టిన ఎల్లోకార్డు, రెడ్‌కార్డు విధానాన్ని వెంటనే రద్దుచేయాలని గురువారం ఏరియాలోని కేకే5గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గనివద్ద బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. అంతకు ముందు ర్యాలీగా గనివద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్, గని ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్, పిట్‌కార్యదర్శి గాండ్లసంపత్ మాట్లాడుతూ సింగరేణిలో యాజమాన్యం కార్మికులను ఇబ్బందులు పెట్టేందుకు ఎల్లోకార్డు, రెడ్‌కార్డు విధానం ప్రవేశపెట్టిందన్నారు. దీనిని కార్మిక వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. అనంతరం గనిమేనేజర్ అల్లావుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, సమ్మయ్య, నాగేశ్వర్ నాయక్, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, జూలై 4: వోల్వో, డంపర్, ట్రక్ ఆపరేటర్ ఉచిత శిక్షణకు శ్రీరాంపూర్ ఏరియా పరిసర గ్రామాల నిరుద్యోగ యువకులు ఈనెల 10లోగా శ్రీరాంపూర్ వీటీసీలో దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 35ఏళ్ల వయస్సు, పదో తరగతి పాసై, హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, మూడేళ్ల డ్రైవింగ్ అనుభవం కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు ఉంటుందని, నిరుద్యోగులు ఈ శిక్షణను సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు.

రూ.20 లక్షల గ్రాట్యూటీ ఇప్పించండి

శ్రీరాంపూర్, జూలై 4: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.20లక్షల గ్రాట్యూటీ ఇప్పించాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టీఎస్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరామ్ సింగ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం హైదరాబాద్‌లో ఆర్‌ఎల్‌సి, సిఎల్‌సి, ఎఎల్‌సిలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ నాయకులు ఆవాల మధుసూదన్ రెడ్డి, మేకలరాజయ్య, బుల్లు సత్తయ్య, దాగంపోశం,ఆవులూరి ఓదెలు,తాహెర్‌ఖాన్, ఏదులూరిఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ల ముట్టడికి తరలిరండి

శ్రీరాంపూర్, జూలై 4: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం నిర్వహించనున్న కలెక్టరేట్ల ముట్టడికి తరలిరావాలని ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఆర్‌కె5,6,7 గనులలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత బ్లాకులను సింగరేణికే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, ఏరియాకార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు సంఘంసదానందం,తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

సింగరేణి బొగ్గుబ్లాకుల వేలం నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం జిల్లాకలెక్టరేట్‌ను ముట్టడించను న్నామని, కార్మిక యూనియన్లకు చెందిన నాయకులు తరలిరావాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ నాయకులు కోరారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నేపథ్యంలో సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ)గా ఏర్పడి ఆందోళనలు చేస్తున్నామన్నారు. అన్నియూనియన్ల నాయకులు, కార్మికులు నేడు నిర్వహించే కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శులు కె. వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: బొగ్గుబ్లాకుల వేలం పాటలకువ్యతిరేకంగా ఈనెల5న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. గురువారం కేకేఓసీపీ వద్ద ధర్నా పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వేలంపాటలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్‌యాదవ్, కోటయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల..

కాసిపేట: బొగ్గుగనుల వేలానికి వ్యతిరేకంగా గురువారం కాసిపేట గనిపై ఈనెల 5న కలెక్టరేట్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నా పోస్టర్లను ఏఐటీయూసీ నాయకులు విడుదల చేశారు. బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, శ్రీహరి, రాజేందర్, సురేష్, సంతోష్, శంకరయ్య పాల్గొన్నారు.